# వందేమాతరం

ఇంగ్లండులోని క్రాలీ అనే ఊళ్ళో ఆఫీసు పని పూర్తిచేసుకున్న తర్వాత, నేనూ జెన్నిఫర్ బుధవారం మధ్యాహ్నం స్టాఫర్డ్‌షైర్‌లోని స్టాఫర్డ్ అనే ఊరికి బయల్దేరాం. అక్కడ శుక్రవారం మధ్యాహ్నం దాకా పని వుంది.

"రైల్లో అక్కడికి వెళ్ళాలంటే రెండు మూడుసార్లు మారాలి. నేను డ్రైవ్‌చేస్తాలే! నా కారులో వెడదాం" అన్నది జెన్నీ.

"నీకేమీ ఇబ్బంది లేకపోతే, నాకేం ఫరవాలేదు. మూడున్నర గంటల ప్రయాణం. నిజానికి కారులో వెడితే ఇంటీరియర్ ఇంగ్లండుని కొంచెం దగ్గరగా చూడవచ్చు కూడాను!" అన్నాను ఓ చిరునవ్వు విసిరి.

జెన్నీ కూడా నవ్వి "అదొక్కటే కాదు. అక్కడికి దగ్గరే స్టోన్ అనే ఊరుంది. అక్కడ మా అంకుల్ వున్నాడు. ఇవాళ సాయంత్రం నన్ను వాళ్ళింటికి రమ్మంటున్నాడు. రేపెలాగూ మనకి బిజినెస్ డిన్నరుంది కనుక, నేనూ ఈరోజు సాయంత్రం వస్తానన్నాను. అందుకని చేతిలో కారుంటే కొంచెం వీలుగావుంటుంది కదా" అన్నది.

అవునన్నట్టుగా తలవూపాను.

"కావాలంటే నువ్వు కూడా మా అంకుల్ ఇంటికి రావచ్చు. ఆయనకి ఫోన్ చేసి చెబుతాను" అన్నది.

చిన్నగా నవ్వి "వద్దులే. మధ్యలో నేనెందుకు. నాకు ఈ రోజు సాయంత్రమే కాస్త ఊరు చూడటానికి సమయం దొరికేది. నన్ను హోటల్లోదించి నువ్వు వెళ్ళు. నేను ఊరు మీద పడతాను" అన్నాను.

"నీ ఇష్టం" అన్నది జెన్నీ సాలోచనగా.

ఇద్దరం జెన్నీ కారులో బయల్దేరాం.

"నువ్వు నేవిగేటర్‌వి. నేను డ్రైవర్ని" అన్నది తన బంగారు రంగు జుట్టుని ఒకసారి పైకి ఎగరేసి.

రోడ్ మాప్‌ల పుస్తకం నా ఒళ్ళో పడేసింది. మిత్రుడు టామ్ మెక్కంజీ పింక్

రంగు మార్కర్‌తో ఎలా వెళ్ళాలో ఆ రోడ్లన్నీ చక్కగా మార్క్ చేశాడు. అందుకని నాకది కొత్త ప్రదేశమైనా ఏమీ కష్టమనిపించ లేదు.

క్రాలీనించి ఎం 23 ఫ్రీవే తీసుకుని లండన్ వేపు కారునడుపుతున్నది జెన్ని.

"డల్లాస్ వెళ్ళే నా ఫ్లైట్ శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకి వుంది. శుక్రవారం సాయంత్రం నన్ను గాట్‌విక్ ఎయిర్‌పోర్ట్ దగ్గర మెరిడియన్ హోటల్లో దించేసి, నువ్వు క్రాలీకి వెళ్ళిపోతావా" అన్నాను.

"బకింగ్‌హామ్‌లోనూ, లండన్‌లోనూ ట్రాఫిక్ సాయంత్రం నాలుగు గంటలకే మొదలవుతుంది. కనుక మనం లంచ్ అవగానే బయల్దేరితే మంచిది" అన్నది జెన్ని ఖాళీగా వున్న రోడ్డు మీద కారుని మరింత వేగంగా నడుపుతూ.

"అలాగే. పదకొండున్నర కల్లా మన నెగోషియేషన్లు పూర్తవుతాయి కదా" అన్నాను.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ దాటి షేక్స్పియర్ స్వస్థలం అయిన వార్‌విక్ షైర్ మీదుగా స్టాఫర్డ్ చేరేసరికి సాయంత్రం ఐదు గంటలయింది.

ఇద్దరం హోటల్లో మా రూముల్లో చెకిన్ అయాక జెన్ని అంది. "నా సామాను రూమ్‌లో పడేసి, కాస్త ఫ్రెషప్ అయి మా అంకుల్ ఇంటికి వెడతాను. నిన్ను ఎక్కడయినా దించ మంటావా?"

నేను చిన్నగా నవ్వి "అక్కర్లేదు. అన్నీ ఇక్కడికి దగ్గరలోనే వున్నట్టున్నాయి. నేను మేనేజ్ చేస్తాలే. హావ్ ఎ గుడ్ టైమ్ విత్ యువర్ ఫోక్స్" అన్నాను.

"రేపు పొద్దున్న ఏడు గంటలకి బ్రేక్‌ఫాస్ట్ రూమ్‌లో కలుద్దాం. ఏడున్నర కల్లా బయల్దేరుదాం" అన్నది.

"సరే" అని లిఫ్ట్ వేపు కదిలాను.

హోటల్నించి అమెరికాలోని ఆస్టిన్‌కి ఫోన్ చేసి శ్రీమతితో బాగానే వున్నానని చెప్పి, స్నానం చేసి బయట పడేసరికి ఆరున్నర దాటింది.

"ఇక్కడ దగ్గరలో మంచి రెస్టారెంట్స్ ఏమన్నా వున్నాయా?" ఫ్రంట్ డెస్క్ దగ్గర వున్న ఆ అందమైన ఇంగ్లీష్ అమ్మాయిని అడిగాను.

ఆమె తన చక్కటి పళ్ళవరుసని తళుక్కుమనిపిస్తూ నవ్వి "ఓ! చాలా వున్నాయి. మీకు ఇండియన్ రెస్టారెంట్స్ కావాలా?" అన్నది.

నాకు కొంచెం ఆశ్చర్యం వేసింది. అంత చిన్న ఊళ్ళో కూడా ఇండియన్ రెస్టారెంట్ వుందా అని.

ఆమెకు నా మనసులోని మాట అర్థమయినట్టుంది. మళ్ళీ ఒక్కసారి ఆ ఎర్ర

పెదవుల నోట్లోని తెల్ల ముత్యాల్ని తళుక్కుమనిపించి "అవును! ఇక్కడ ఇండియన్ రెస్టారెంట్లు చాల వున్నాయి. ఇంగ్లీష్‌వారి నేషనల్ ఫుడ్.... అదే ఫేవరేట్ ఫుడ్ ఏమిటో తెలుసా? కర్రీ. ఇండియన్ కర్రీ" అన్నది.

"అయితే నాకా ఇండియన్ రెస్టారెంట్‌కి ఎలావెళ్ళాలో చెబుతావా?" అన్నాను.

"హోటల్ బయటికి పోగానే ఎడమవేపుకి తిరిగి పది నిమిషాలు నడిస్తే కాశ్మీర్ కింగ్ అని మంచి ఇండియన్ రెస్టారెంట్ వుంది. ఎంజాయ్ యువర్ ఈవెనింగ్" అంది.

ఆమెకి థాంక్స్ చెప్పి, బయటకు వచ్చి ఆమె చెప్పిన దారినే నడవటం ప్రారంభించాను. స్టాఫర్డ్ అనే ఊరు స్టాఫర్డ్‌షైర్‌లో వుంది. ఇంగ్లాండులో షైర్ అన్న మాట ఇండియాలోని జిల్లాలాగా వాడతారని అనవచ్చేమొ. చిన్న ఊరు. చాల శుభ్రంగా అందంగా వుంది. విశాలమైన రోడ్లు. అటూ ఇటూ పెద్ద చెట్లు.విక్టోరియన్ పద్ధతిలో కట్టిన ఇళ్ళు. పక్కనే ఒక ఆటస్థలంలో ఆ దేశానికి ఎంతో అభిమానమైన ఆట ఫుట్‌బాల్ ఆడుతున్నారు. ఇద్దరు పిల్లలు సైకిల్ తొక్కుకుంటూ వెడుతున్నారు. కాస్త చలిగా వుందేమొ, నడుస్తుంటే హాయిగావుంది. ఇండియాలోలాగా రోడ్డుకి ఎడమపక్కన నడుపుతున్నారు కార్లు. అమెరికాలో కుడి వైపున కారు నడపటానికీ, నాలుగు రోడ్ల కూడళ్ళకీ అలవాటయిన నాకు, అక్కడి ట్రాఫిక్ రౌండ్ ఎబౌట్ల దగ్గర వేగంగా వెడుతున్న కార్లను చూస్తే కొంచెం కంగారుగానే అనిపించింది.

ఎదురుగా నియాన్ లైట్లతో వెలిగిపోతున్నది కాశ్మీర్ కింగ్ అనే ఆ ఇండియన్ రెస్టారెంట్.

తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాను. ఎవరూ లేరు. సన్నటి దీపపు కాంతిలో ఖాళీగా వున్నట్టు తెలుస్తూనేవుంది. అమెరికన్ పద్ధతి ప్రకారం తలుపుదగ్గరే నుంచున్నాను. నేను తలుపు తోసినప్పుడు లోపల గంట మోగినట్టుంది, అతను అప్పుడే బయటికి వచ్చి నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు.

చూపుడు వేలు పైకెత్తి "సీట్ ఫర్ వన్" అన్నాను.

"హవార్యు సర్? ప్లీజ్ కమ్ ఇన్" అంటూ నన్ను కిటికీ పక్కన బల్ల దగ్గర కూర్చోబెట్టాడు.

అతనికి ఇరవై నాలుగేళ్ళ వయసుంటుందేమొ. నాలాగానే బ్రౌన్‌గా వున్నాడు. మంచి చురుకైన కళ్ళు. అతని భాష పూర్తి ఇంగ్లీష్ (బ్రిటిష్) ఏక్సెంట్‌లో వుంది.

కూర్చున్నాక, అతన్నిమాటల్లో దించటానికని "ఇవాళ బిజీగా లేనట్టుందే" అన్నాను.

అతను నవ్వి "అవును. ఇవాళ బుధవారం కదా. డైనిన్‌కి వచ్చే వాళ్ళు తక్కువ.

టికష్టాలు ఎక్కువ వుంటాయి. బిజినెస్ మాత్రం బాగుంది" అన్నాడు.

నా పేరు చెప్పి పరిచయం చేసుకున్నాను. యు ఎస్ నించీ ఆఫీస్ పని మీద అక్కడికి వచ్చాననీ, టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో నివాసం అనీ చెప్పాను.

"మా బాబాయి వున్నాడు వాషింగ్టన్‌లో. ఎప్పుడూ రమ్మంటాడు కానీ ఇంత వరకూ వెళ్ళలేదు" అన్నాడు అతను. ఇంతలోనే గుర్తుకొచ్చినట్టుంది "మరిచిపోయాను. నా పేరు చెప్పలేదు కదూ. మాలిక్. మాలిక్ ఖురైషి. మీ ఆర్డర్ చెప్పండి" అన్నాడు.

మెన్యూ చూసి, కావలసినవి ఆర్డర్ చేశాను. అతను లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో బయటికి వచ్చాడు. ఒక ప్లేటులో రెండు అప్పడాలు ఎపిటైజర్‌లాగా తీసుకు వచ్చాడు. ఒక గ్లాసు నిండా మామిడిపండు రసం తెచ్చి "ఇది మీకోసం. ఆన్ ది హౌస్" అన్నాడు నవ్వుతూ.

"ఎందుకు... ఫ్రీగా ఇవ్వనవసరం లేదు..." అన్నాను.

"బిజినెస్ పరంగా కాదు నేను ఇచ్చింది. సాంస్కృతిక పరంగా. మీరు అమెరికా నించి వచ్చిన అతిథి కదా" అన్నాడు.

అని చిరునవ్వు నవ్వి నా ఎదురుగా కూర్చున్నాడు.

సాంస్కృతికపరంగా అన్నాడు కాబట్టి, కొంచెం చనువు తీసుకుంటూ "మీది ఇండియానా.. పాకిస్థానా?.." అని అడిగాను కుతూహలంగా.

"అది నాకు తెలీదు. మీరే చెప్పాలి. మా నాన్న పుట్టింది పంజాబ్‌లో నాన్నకి మూడేళ్ళప్పుడు మా తాత నాయనమ్మ ఇంగ్లాండ్‌కి వచ్చేశారు. అప్పుడు ఇండియన్స్ అందరూ బ్రిటిష్ వాళ్ళ క్రిందే వున్నారు కదా మరి. మా నాన్న ఇంగ్లాండ్ వచ్చేసిన తర్వాత నాలుగేళ్ళకి, అంటే 1947లో బ్రిటిష్‌వాళ్ళు ఇండియా పాకిస్థాన్‌లని రెండుగా విభజించి, రెండు దేశాలకీ స్వరాజ్యం ఇచ్చి వెనక్కివచ్చేశారు. మా అమ్మ ఊరు ఇప్పుడు ఇండియాలో వుంది. మా నాన్న ఊరు పాకిస్థాన్లో వుంది. కాకపోతే వాళ్ళిద్దరికీ ఇప్పుడక్కడెవరూలేరు. మేమూ మా దగ్గరి చుట్టాలూ అందరం ఇప్పుడిక్కడే వుంటున్నాం. నేను ఇక్కడే పుట్టి పెరిగాను!" అని నవ్వి మళ్ళీ అన్నాడు, "ఇప్పుడు చెప్పండి. నేను ఇండియన్నా పాకిస్థానీనా, బ్రిటిష్‌వాడినా?"

నేను కూడా చిన్నగా నవ్వి, మాట్లాడకుండా అప్పడం తింటున్నాను.

ఈలోగా ఎవరో ఒక తెల్లతను వచ్చి, మాలిక్‌ని చూసి పలకరింపుగా చేయి పైకెత్తాడు.

మాలిక్ లేచి "మీ ఆర్డర్ రెడీ. లెట్‌మి గెటిట్" అని లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో బయటికి వచ్చాడు. బిల్ సెటిల్ చేసుకుని, అతనికి ఒక పేపరు సంచి అందిం

చాడు. అతను వెళ్ళాక, మళ్ళీ వచ్చి నాముందు కుర్చీలో కూర్చున్నాడు.

"సో.... ఇక్కడే కాలేజికి వెళ్ళావా?" అని అడిగాను.

"అవును. డిగ్రీ చేశాను కానీ ఉద్యోగంలో చేరలేదు. మా నాన్న ముప్ఫై ఏళ్ళ నించీ నడుపుతున్నాడీ హోటల్ని. ఆయనకి అరవై ఏళ్ళు రాగానే - అంటే ఆరు నెలల క్రితమే - రిటైరయి నాకీ బాధ్యత అప్పచెప్పాడు. నాకూ బాగున్నదనిపించి వెంటనే ఒప్పుకున్నాను"

మాలిక్ బహు మాటకారి. చక్కగా చెప్పటమే కాదు, అతని బ్రిటిష్ ఏక్సెంటు కూడా బాగుంటుంది.

అతనే చెప్పుకు పోతున్నాడు. "పోయిన సంవత్సరమే పెళ్ళి చేసుకున్నాను. ఆ అమ్మాయి కూడా ఈ దేశంలోనే పుట్టి పెరిగింది. ఇక్కడ గమ్మత్తేమిటో తెలుసా? ఆమే, ఆమె తల్లితండ్రులూ కూడా బ్రిటిష్ పౌరులే కాని, ఇండియాలోని వాళ్ళ స్వస్థలం ఇప్పుడు... తూర్పు పాకిస్థాన్‌లో.. అదే ఈనాటి బంగ్లాదేశ్‌లో వుంది" అన్నాడు పెద్దగా నవ్వి.

"వినటానికి కథ చాల సరదాగా వుంది" అన్నాను చిన్నగా నవ్వుతూ.

"ఆ నాటి బ్రిటిష్ సామ్రాజ్యంలో ఆ దేశాలన్నీ ఒకటే కదా మరి.. " అన్నాడు.

"అవును! అది రవి శాశ్వతంగా అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యం కదూ"అన్నాను నవ్వుతూ.

అతనూ నవ్వాడు.

ఈలోగా ఎవరో చైనీస్ కుటుంబం వచ్చింది భోజనానికి.

మాలిక్ లేచి "ఉండండి. ఇప్పుడే వస్తాను" అని వాళ్ళకి మెన్యూ ఇచ్చి కొంచెం అవతలగా కూర్చో బెట్టాడు.

లోపలికి వెళ్ళి నవరతన్ క్రర్రీ, ఆలూ పరోటా, వెజిటబుల్ పలావ్ తెచ్చి, నా ముందు పెట్టాడు. ఈలోపల ఫోన్ మ్రోగటంతో, అక్కడికి వెళ్ళి కొన్ని ఫోన్ ఆర్డర్లు తీసుకుంటున్నాడు.

నేను ప్లేట్ ముందుకి లాక్కుని ఆత్మారాముడ్ని శాంత పరుస్తున్నాను. లోపలి నించి ఇంకొక వెయిటర్ వచ్చి, ఆ చైనీస్ కుటుంబం వారి ఆర్డర్ తీసుకుంటున్నాడు.

తన పనవగానే మాలిక్ నా దగ్గరకి మళ్ళీ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు.

"సర్! అమెరికాలో మిమ్మల్ని అమెరికన్‌లా చూస్తారా? ఇండియన్‌లా చూస్తారా... " అని అడిగాడు ఏమీ సంకోచం లేకుండా.

ఒక్క క్షణం ఆలోచించి అన్నాను. "దానికి జవాబు ఒక్క వాక్యంలో చెప్ప

టం కష్టం. ఎందుకంటే అమెరికా ఇమ్మిగ్రెంట్సుతో నిండిన దేశం. కొందరు ఈ తరంలో వచ్చిన వాళ్ళయితే, మిగతా వాళ్ళు రెండు... మూడు... నాలుగు తరాలుగా అక్కడ వున్నవాళ్ళు. ప్రతివాళ్ళకూ యూరప్‌లోనో, ఆఫ్రికాలోనో, ఏషియాలోనో వాళ్ళ పూర్వ చరిత్ర వుంది. ఈనాడు కూడా ఉద్యోగాల్లోనూ చదువుల్లోనూ మిగతా చోట్లా, డిస్క్రిమినేషన్ వున్నది! .... లేదు! అది మనుష్యుల స్వభావాల్ని బట్టి వున్నదే కానీ, వేళ్ళు పాతుకుపోయిన ఒక దురాచారంలా మాత్రం లేదు. నాకు ఆఫీసులోనూ, బయటా ఎంత గౌరవం ఇవ్వాలో అంతా ఇస్తున్నారు. నేను అటు అమెరికన్లతో కలిసిపోయాను. ఇటు నా భారతీయ సంస్కృతినీ కాపాడుకుంటున్నాను"

అతనికి అర్ధమయేలా చెప్పానో, అతని ఆలోచనలని ఇంకా గందరగోళం చేశానో నాకు తెలియలేదు. కానీ అతని చిరునవ్వుని చూస్తే, నేను చెప్పింది పూర్తిగా అర్ధం చేసుకున్నవాడి లాగానే కనపడ్డాడు.

"ఎందుకు నవ్వుతున్నావ్!" అని అడిగాను నేనూ నవ్వుతూ.

అతను కొంచెం తడబడి "ఐ యామ్ సారీ! మీరు చెప్పిన విషయం గురించి కాదు. మీరు చెప్పింది విన్నాక నాకు జరిగిన కొన్ని అనుభవాలు గుర్తుకు తెచ్చుకుని నవ్వాను. అంతే!" అన్నాడు.

చిన్నగా తల వూపి, అతని స్వంత విషయాలు అడగటం సభ్యత కాదు కనుక పరోటాల సంగతి పట్టిస్తున్నాను.

సగం చెప్పి వదిలేయటం కూడా సభ్యత కాదు కనుక, అతనే చెప్పటం ప్రారంభించాడు.

"మనుష్యుల ఆలోచనలూ, వారి ప్రవర్తనా ఎంత నారో బ్యాండ్‌లో వుంటాయో చూడండి. నేను ఇంగ్లండ్‌లోనే పుట్టి పెరిగినా, నా ఇంగ్లీష్ బ్రిటిష్ ఇంగ్లీషే అయినా, ఇక్కడి వాళ్ళు నన్ను ఏషియన్‌గానే చూస్తారు కానీ, ఇంగ్లీష్‌వాడిలా చూడరు..."

"అవును మరి. ఇండియన్ రెస్టారెంటు నడుపుతున్నావ్ కదా" అన్నాను నవ్వుతూ.

అతనూ నవ్వి "నిజమేననుకోండి. కానీ ఇక్కడికి రెండు బ్లాకుల అవతల, ఒక తెల్ల ఆంగ్లికన్ కూడా ఇండియన్ రెస్టారెంట్ నడుపుతున్నాడు. అతన్ని ఇండియన్‌లాగా చూడరు కదా వీళ్ళు..."

మంచి లాజిక్ చూపించాడు మాలిక్. అందుకే అతన్ని చూడగానే అనుకున్నాను తెలివైనవాడని.

"మరిచిపోయాను. ఫుడ్ ఎట్లావుంది?" అని అడిగాడు.

"చాల బాగుంది. బెటర్ దాన్ వాట్ ఐ ఏట్ ఇన్ క్రాలీ...." అన్నాను.

"థాంక్స్!" అని లోపలికి వెళ్ళి ఒక ట్రేలో కొన్ని సమోసాలు తీసుకువచ్చి, అవి సర్దుతూ అన్నాడు.

"పాకిస్థాన్‌లోని మా నాన్న వేపు చుట్టాలు, నన్ను ఇండియన్‌లాగా చూస్తారు. ఎందుకంటే మా అమ్మ చుట్టాలు ఇండియా వదిలి పాకిస్థాన్‌కి రావటానికి నిరాకరించారు కనుక. అలాగే మా అమ్మవేపు వాళ్ళు నన్ను పాకిస్థానీలాగా చూస్తారు. అప్పుడు నాకనిపిస్తూ వుంటుంది.... నేనెవర్నీ అని" అతను సమోసాలు బ్రౌన్ బేగ్‌లో పాక్ చేస్తూ అటు తిరిగి వుండటం వల్ల అతని ముఖకవళికలు చూడటానికి అవకాశం రాలేదు. అందుకే నిర్లిప్తంగా అన్నాడో, బాధతో అన్నాడో అర్థంకాలేదు.

"నువ్వు బ్రిటిష్ పౌరుడివి. ఎవరేమనుకుంటే ఏం. ఈ రెస్టారెంట్ ఓనర్‌వి. ఎంతో ఉత్సాహం, తెలివితేటలూ పుష్కలంగా వున్న కుర్రాడివి. అంతకన్నా ఇంకేం కావాలి.." అన్నాను అతనికి కొంత స్ఫూర్తినివ్వాలని.

అతను నవ్వాడు. కానీ ఏమీ అనలేదు.

ఈలోగా ఫోన్ మ్రోగింది. ఏదో ఆర్డర్ తీసుకుని, మళ్ళీ బిజీ అయిపోయాడు.

నా డిన్నర్ కూడా పూర్తవటంతో, ఇక నేను వెళ్ళాలని చెప్పాను.

నేను బిల్ పే చేస్తున్నప్పుడు అన్నాడు. "నా స్వంత విషయాలు చెప్పి మిమ్మల్ని బోరు కొట్టలేదు కదా"

"నోనో! నాటెటాల్" అన్నాను, క్రెడిట్ కార్డ్ రిసీట్ మీద సంతకం చేస్తూ.

అతను స్నేహ పూర్వకంగా నవ్వి, షేక్‌హాండ్ చేసి "నైస్ టాకింగ్ టు యు సర్" అన్నాడు.

అతని చేయి మృదువుగా నొక్కి "గుడ్ లక్! థాంక్స ఫర్ ది నైస్ ఈవినింగ్" అని, నా హోటల్ వేపు నడిచాను.

కొంచెం చలిచలిగా వుంది. కోటు గుండీలు పెట్టుకుని, జేబుల్లో చేతులు పెట్టుకుని వేగంగా నడుస్తుంటే – ఆ చిరు చలిలో వెచ్చగా హాయిగా వుంది.

అతను చెప్పిన విషయం నాలో ఏవేవో ఆలోచనలను రేకెత్తించింది. ఆర్థర్ హైలీ వ్రాసిన "రూట్స్" నవల గుర్తుకొచ్చింది. ఆ కథలో ఒక సామాన్యుడు కింటాకుంటే ఆఫ్రికాలోని తన రూట్స్... అంతు తెలియని తన వంశవృక్షాన్ని వెతుక్కుంటూ వెడతాడు. మరి మాలిక్ వంశవృక్షం ఎదురుగా కనపడుతున్న ఓక్ వృక్షమంత స్పష్టంగా వుంది. అయినా అతని చుట్టూ వున్న వాళ్ళకి అంత మసకగా ఎందుకు కనిపిస్తున్నది?

అప్పుడే వానచినుకులు పడటం మొదలుపెట్టాయి. నా కళ్ళజోడు మీద చినుకులు పడి రోడ్డూ, రోడ్డు పక్కన చెట్లూ మసకగా కనిపిస్తున్నాయి. జేబురుమాలుతో కళ్ళజోడు తుడుచుకున్నాను. ఇప్పుడన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

లిఫ్ట్ దగ్గరికి వెడుతుంటే, ఫ్రంట్ డెస్క్ దగ్గర పని చేసుకుంటున్న అందమైన ఇంగ్లీష్ పిల్ల, తన నోట్లోని ముత్యాల్ని ఆ డెస్క్ మీద మరోసారి పారేసుకుంటూ అడిగింది "హౌ ఈజ్ ది ఫుడ్?" అని.

నేనూ నవ్వి "ఎక్సలెంట్! నాకు పొద్దున్నే ఆరుగంటలకి వేకప్ కాల్ ఇస్తావా? రూమ్ నెంబర్ త్రీ టు వన్" అన్నాను.

"షూర్! హావ్ ఎ గుడ్ నైట్!" అన్నది.

ఆమెకి థాంక్స్ చెప్పి, రూమ్‌కి వెళ్ళి, కొత్తగా విడుదలయిన కారా గారి కథల పుస్తకం చదువుకుంటూ, అలసటతో నిద్రలోకి జారుకున్నాను.

మర్నాడూ, తర్వాత రోజు అంటే శుక్రవారం మధ్యాహ్నం దాకానూ ఆఫీసు పనితో చాలా బిజీగా, హడావిడిగా గడిచిపోయింది. లంచ్ అవగానే నేనూ జెన్నీ కారులో లండన్‌కి బయల్దేరాం.

కాసేపు ఆఫీసు కబుర్లు చెప్పుకున్నాక, జెన్నీని అడిగాను, "మీ అంకుల్ ఎలా వున్నారు?" అని.

"ఓ! హి ఈజ్ డూయింగ్ వెరీ వెల్! బాగానే వున్నాడు. మా ఆంటీ వచ్చే శనివారం వస్తుందిట. ఈయన ఆదివారం వెడుతున్నాడు" అన్నది.

నాకు ఆమె చెప్పిందేమీ అర్థం కాలేదు. నా చూపుల్లోని ప్రశ్నార్థకాల్ని తన సన్నటి పొడుగాటి వేళ్ళతో లెక్కకట్టి పెద్దగా నవ్వి "సారీ! నా భాష నీకు అర్థమవలేదు కదూ. మళ్ళీ చెబుతాను విను" అని వివరంగా చెప్పింది.

"మా అంకుల్ ఇక్కడే యూనివర్సిటీలో టీచింగ్ చేస్తుంటాడు. అమెరికాలో ప్రెసిడెంట్ కార్టర్ చేస్తున్న హేబిటాట్ ఫర్‌హ్యూమానిటీ లాటి దాంట్లో, సమయం దొరికినప్పుడల్లా పని చేస్తుంటాడు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో మాత్రమే కాకుండా, యూరప్‌లోని చాల దేశాల్లో, ముఖ్యంగా ఈస్టరన్ యూరప్‌లోని బీద దేశాల్లో, పేదవాళ్ళకు ఇళ్ళు కడుతుంటాడు. ముఖ్యంగా శ్రమదానం. వీళ్ళందరూ ఒక టీమ్‌లాగా వెళ్ళి ఎన్ని రోజులు వీలుంటే అన్నాళ్ళు పని చేస్తుంటారు. దాదాపుగా పదిహేనేళ్ళ నించీ ఇలా తను చేయగలిగినంత చేస్తూనే వున్నాడు. వయసుమీద పడుతున్నా ఎందుకంత కష్టపడతావని నేను అడిగితే, యూనివర్సిటీలో పనిచేసేది బిల్స్ కట్టటానికీ, ఈ పనిచేసేది ఒక మానవుడిగా

తన ధర్మం నెరవేర్చటానికి అంటాడు. వచ్చే ఆదివారం క్రోయేషియాకి వెడుతున్నాడు. యూనివర్సిటీకి శెలవులు కదా, నెల రోజుల దాకా తిరిగి రాడు. కానీ గమ్మత్తేమిటో తెలుసా? మా ఆంటీ నెల రోజులుగా ఈ దేశంలో లేదు. రేపు శనివారమే తిరిగి వస్తున్న ది!" అని నవ్వింది.

"ఆవిడేం చేస్తుంటారు?" అడిగాను.

"మా ఆంటీ ఒక మంచి డాక్టర్. ఇక్కడే హాస్పిటల్లో పనిచేస్తున్నది. ప్రతి సంవత్సరం ఒక నెలరోజులు శెలవు తీసుకుని రెడ్ క్రాస్ తరపున రకరకాల దేశాలకు వెళ్ళి, అక్కడ ఉచితంగా మెడికల్ కాంప్‌లు పెట్టి సేవ చేస్తుంటుంది. తన ఆస్తి కూడా చాలవరకూ ఇలాటి మానవసేవా కార్యక్రమాల్లో ఖర్చుపెడుతుంటుంది. ఆవిడ నెలరోజుల క్రితం ఇథియోపియా వెళ్ళింది. శనివారం తిరిగి వస్తుందిట. వాళ్ళిద్దరూ ట్రూ సిటిజెన్స్ ఆఫ్ ది వరల్డ్!" అన్నది.

చటుక్కున తల పైకెత్తి, చురుగ్గా జెన్నీ వేపు చూశాను. మాలిక్ చెప్పిన కథకు ముగింపు దొరికినట్టు అనిపించింది.

అవును. మాలిక్ దేశం లేని వాడు కాదు. సిటిజెన్ ఆఫ్‌ది వరల్డ్!

ఈ ప్రపంచ పౌరుడు!!

❀